సాక్షి వనపర్తి

సోమవారం ; 24 ; ఏప్రిల్ ; 2023



నల్లమలలో కార్చిచ్చు

నలమలలో నిత్యం ఏదో ఒకచోట అగ్ని ప్రమాదం జరిగి అడవి దగ్ధమవుతోంది.

వివరాలు 8లో ▸



పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి

ప్రస్తుతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు పాలిటెక్నిక్ విద్య ఎంతో దోహదపడుతుంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /25.0

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

'పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి'



పాన్‌గల్: పార్టీ బలోపేతమే లక్ష్యంగా బూత్‌కమిటీలు, కార్యకర్తలు సంఘటితంగా పనిచేయాలని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పుట్టా నాగరాజునాయుడు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బూత్ స్వశక్తీకరణ్, నిరుద్యోగమార్చ్, యువ సంఘటన అభియాన్, మహిళా చైతన్యయాత్ర తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు వివరించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు.

నిరుద్యోగమార్చ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ..

ఈ నెల 25న పాలమూరులో నిర్వహించే నిరుద్యోగమార్చ్ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ప్రతి గ్రామం నుంచి పెద్దసంఖ్యలో నిరుద్యోగులు మార్చ్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగమార్చ్‌పై గ్రామ గ్రామాన అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రోజారమణి, అన్వేష్, జగన్‌గుప్తా, వెంకటేష్‌యాదవ్, మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కోటిలింగాల ప్రతిష్ఠ మండప నిర్మాణానికి శంకుస్థాపన



కొత్తకోట: పురపాలికలోని కానాయపల్లి స్టేజీ దగ్గర ఉన్న కోటిలింగేశ్వర దత్తక్షేత్రంలో ఆదివారం అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయకమిటీ, ప్రముఖుల ఆధ్వర్యంలో కోటిలింగాల ప్రతిష్ఠ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్ అంజన్నయాదవ్, వడ్డె శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రావుల రాజేశ్వరమ్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ బలోపేతం కోసం ఉద్యోగులు కష్టపడి పనిచేయాలని డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్యామల అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం కండక్టర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని కోరారు. సంస్థ మనుగడ కోసం ప్రతి ఉద్యోగి పాటుపడాలని సూచించారు. పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్లు అర్జున్‌కుమార్, రంగప్ప శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్ రాంజీ, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌గౌడ్, బాల్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ ఆదేశాల అమలేది

అతిథి గృహాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు



పంచాయతీరాజ్‌శాఖ ఈఈ కార్యాలయం కొనసాగుతున్న గెస్ట్‌హౌస్ ఇదే..

- పాత భవనంలోనే పీఆర్ ఈఈ కార్యాలయం
- ప్రారంభానికి నోచుకోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్

వనపర్తి: పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం చేపట్టింది. అన్ని కార్యాలయాలు కచ్చితంగా సమీకృత భవనంలోనే ఉండాలని సీఎస్ శాంతకుమారి ఫిబ్రవరి మొదటి వారంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పష్టమైన ఆదేశాలిచ్చినా.. జిల్లాలోని కొన్ని ఇంజినీరింగ్ కార్యాలయాలు మాత్రం కదలడం లేదని చెప్పవచ్చు. సీఎస్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని గదులను రెండోసారి అన్ని కార్యాలయాలకు సర్దుబాటు చేసినా.. పీఆర్ ఈఈ, ఈడబ్ల్యూఐడీసీ డీఈఈ కార్యాలయాలు మాత్రం పాత భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ రెండు కార్యాలయాలకు జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు మినహాయింపు ఇచ్చారన్న విషయంపై మిగతా శాఖల్లో చర్చ నడుస్తోంది. రూ.51.70 కోట్లతో 25 ఎకరాల సువిశాలమైన ప్రదేశంలో అన్ని సౌకర్యాలతో సమీకృత కలెక్టరేట్ భవనం నిర్మించారు.

కొత్త జిల్లాల ఏర్పాటులో..

2016 చివర్లో కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ఒక్కసారిగా ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, గెస్ట్‌హౌస్‌లను వినియోగించారు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం తర్వాత కూడా జిల్లాకేంద్రంలోని రెండు అతిథి గృహాలు నేటికీ కార్యాలయాలుగానే కొనసాగుతున్నాయి. ఐబీ గెస్ట్‌హౌస్‌లో ఇరిగేషన్ సీఈ కార్యాలయం, పీఆర్ గెస్ట్‌హౌస్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ జిల్లా కార్యాలయం కొనసాగుతున్నాయి. రీ అలకేషన్‌లో పీఆర్ ఈఈ కార్యాలయానికి గదిని కేటాయించినా.. మార్చలేదన్న విమర్శలున్నాయి.

గది కేటాయించలేదు..

సమీకృత కలెక్టరేట్‌లో మా కార్యాలయానికి గది కేటాయించలేదు. దీంతో పాత పంచాయతీరాజ్ డీఈఈ భవనంలో కార్యాలయం కొనసాగిస్తున్నాం. అతి తక్కువ సిబ్బంది ఉండటంతో రెండు గదులు మాత్రమే ఉన్న ఈ భవనంలోనూ ఎలాంటి ఇబ్బంది లేకుండా విధులు నిర్వర్తిస్తున్నాం.

– శ్రీనివాసులు, డీఈఈ, ఈడబ్ల్యూఐడీసీ

కేటాయించిన గది చిన్నగా ఉంది..



రీ అలకేషన్‌లో సమీకృత కలెక్టరేట్ భవనంలోని రెండో అంతస్తులో కార్యాలయం నిర్వహణకు గదిని కేటాయించారు. 30 మంది సిబ్బంది ఉండటంతో కేటాయించిన గది సరిపోదని ప్రస్తుతానికి పీఆర్ గెస్ట్‌హౌస్‌లోనే కార్యాలయ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఈఈ కార్యాలయంతో పాటు వనపర్తి, పెద్దమందడి సబ్ డివిజన్ కార్యాలయాలు సైతం గెస్ట్‌హౌస్‌లోనే కొనసాగుతున్నాయి.

– మల్లయ్య, పీఆర్ ఈఈ

వినియోగంలోకి రాని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్..

వీఐపీలు వస్తే సౌకర్యవంతమైన గెస్ట్‌హౌస్‌లు ఉండాలని మంత్రి హోదాలో డా. జి. చిన్నారెడ్డి 2009 సాధారణ ఎన్నికల ముందు నాగవరం శివారులో రూ.1.40 కోట్లతో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌గౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థల వివాదంతో కొన్నేళ్ల పాటు నిర్మాణం సాగకపోవటంతో పట్టణంలోని శ్రీరామ థియేటర్ వద్ద ఆర్‌అండ్‌బీ స్థలంలో పనులు ప్రారంభించి ఇటీవల పూర్తిచేశారు. ప్రారంభోత్సవానికి పాలకులు సమయం ఇవ్వకపోవటంతో వినియోగంలోకి రాలేదు.

గట్టు.. గట్టెక్కేనా

తొలిదశలో రూ.328 కోట్లతో ఎత్తిపోతల పనులు



జలాశయం ఆనకట్టకు సంబంధించి కొనసాగుతున్న పనులు

- ఏడాదిన్నరలో పూర్తి చేయాలని ఒప్పందం
- ప్రాథమిక దశలోనే పనులకు అడ్డంకులు
- ప్రధాన సమస్యగా మారిన భూ సేకరణ ప్రక్రియ
- పూర్తయితేనే గట్టు బీడు భూములకు సాగునీరు



ప్రెషర్ పైపులైన్ పనులు

గద్వాల రూరల్: గట్టు ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఎత్తిపోతలకు ఎట్టకేలకు మోక్షం లభించి పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఈ పనులు మొదలు కావడానికి ఎదురైన అడ్డంకులకు మించిన స్థాయిలో పూర్తి కావడానికి ఇబ్బందులు నెలకొన్నాయి. ఒకవైపు భూ సేకరణ, మరోవైపు ర్యాలంపాడు జలాశయం మరమ్మతు.. వెరసి గట్టు ఎత్తిపోతలు పూర్తి కావడానికి ఎన్నేళ్లు పడుతుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నో ఆశలతో మొదలైన ఈ పథకం కూడా మరో పెండింగ్ ప్రాజెక్టుల జాబితాలో చేరుతుందేమోనని స్థానికులు భయపడుతున్నారు.

ప్రభుత్వం శీతకన్ను..

నెట్టెంపాడు ఎత్తిపోతలలో భాగంగా 4 టీఎంసీల సామర్థ్యం ర్యాలంపాడు జలాశయాన్ని నిర్మించారు. దీని కింద 1.36 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే 2019 ఖరీఫ్ సీజన్‌లో ర్యాలంపాడు ఆనకట్ట అడుగు భాగాన లీకేజీలు ఏర్పడడంతో ఆయకట్టు పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఈ జలాశయం కింద ఉన్న ఆయకట్టుతోపాటు సుమారు 20కిపైగా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం నెలకొంది. దీంతో జలాశయంలో పూర్తిస్థాయిలో 4 టీఎంసీల నీటిని కాకుండా మూడేళ్లుగా 2 టీఎంసీలను మాత్రమే నిల్వ చేస్తున్నారు. ర్యాలంపాడు నిర్మాణంలో చోటుచేసుకున్న లీకేజీ వ్యవహారంపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి మరమ్మతు చేసేందుకు గతేడాది ప్రభుత్వం హైదరాబాద్‌కు చెందిన ఏజెన్సీకి రూ.58 లక్షలతో పనులు అప్పగించింది. సర్వే చేసిన సదరు ఏజెన్సీ మరమ్మతు చేసేందుకు మూడు రకాల అంచనాలు రూపొందించి గతేడాది డిసెంబర్‌లో సాగునీటి నిపుణుల కమిటీకి పంపింది. కాగా.. ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ర్యాలంపాడు మరమ్మతుపై నీలినీడలు అలుముకున్నాయి.

ర్యాలంపాడు నుంచే..

ఇదిలా ఉండగా గట్టు ఎత్తిపోతల పథకాన్ని 2.80 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తుండగా దీనిని ప్రధానంగా ర్యాలంపాడు జలాశయం ఆధారంగానే చేపడుతున్నారు. గట్టుకు 2.80 టీఎంసీల నీటిని ర్యాలంపాడు నుంచే ఎత్తిపోయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ర్యాలంపాడుకు ఏర్పడిన లీకేజీల కారణంగా పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయని పరిస్థితి. ఈ నేపథ్యంలో గట్టు ఎత్తిపోతలకు అవసరమైన 2.80 టీఎంసీల నీటిని ఏ విధంగా ఎత్తిపోస్తారన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

అత్యంత వెనకబడిన ప్రాంతం..

ఆసియా ఖండంలోనే గట్టు అత్యంత వెనకబడిన ప్రాంతంగా పేరుంది. ఇక్కడి ప్రజలకు వ్యవసాయ భూములు ఉన్నా వాటికి సాగునీరు లేకపోవడంతో బీళ్లుగా మారాయి. దీంతో పొట్ట చేత పట్టుకుని బతుకుదెరువు కోసం వేల కుటుంబాలు వలసపోయే పరిస్థితి. అయితే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా నిర్మించిన నెట్టెంపాడు ప్రాజెక్టుతో ఇక్కడి పరిస్థితుల్లో కొంత వరకు మార్పులు వచ్చాయి. ఈ ప్రాంతానికి పూర్తిస్థాయిలో నీరు పారాలంటే గట్టు ఎత్తిపోతలు నిర్మించాలన్నది స్థానికుల ప్రధాన డిమాండ్. దీంతో గట్టు ఎత్తిపోతలు ఇక్కడి అన్ని పార్టీలకు ఎన్నికల నినాదంగా మారింది. మాజీ మంత్రి డీకే అరుణ 2013లో శంకుస్థాపన చేయగా తర్వాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయి గట్టు ఎత్తిపోతలకు బ్రేకులు పడ్డాయి.

నలసోమనాద్రి ఎత్తిపోతలుగా..

సీఎం కేసీఆర్ గట్టు ఎత్తిపోతలకు నలసోమనాద్రి ఎత్తిపోతల పథకంగా 2018లో శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో పనులు పూర్తి చేసి నీళ్లు పారిస్తామని ఎన్నికల ముందు సీఎం హామీ ఇచ్చారు. 33 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.580 కోట్ల వ్యయంతో 2.80 టీఎంసీల సామర్థ్యం గల జలాశయం నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఈ క్రమంలో మొదటి దశ కింద రూ.328 కోట్ల పనులకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా 18 నెలల్లో జలాశయం, అప్రోచ్ కెనాల్, పంప్‌హౌజ్, ప్రెషర్ మెయిన్ వంటి ప్రధాన పనులు చేపట్టాల్సి ఉంది.

- దినదిన గండం అన్న చందంగా మొదలైన గట్టు ఎత్తిపోతల పనులకు ప్రాథమిక దశలోనే సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గట్టు, కేటీదొడ్డి మండలాల పరిధిలో ప్రధాన పనులు చేపడుతుండగా ఇందుకోసం 965 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అయితే పనుల ప్రారంభంలో భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం పరిహారం ఇస్తుందని స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు రైతులకు నమ్మబలికారు. అయితే పనులు జోరుగా సాగుతుండగా.. పరిహారం రావడం లేదని రైతులు వాపోతున్నారు.

పరిహారం ఇవ్వాలి..



నాకు కుచినెర్ల శివారులో 5 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఎనిమిదేళ్ల కిందట 4 ఎకరాల్లో మామిడి తోట పెట్టుకున్నా. ప్రస్తుతం తోటతో పాటు మిగిలిన ఎకరా భూమి కూడా పూర్తిగా ముంపునకు గురైంది. ఎమ్మెల్యే, ఇరిగేషన్ శాఖ అధికారులు త్వరలోనే పరిహారం డబ్బులు ఇస్తామని చెప్పారు. ఆరు నెలలు కావొస్తున్నా ఇంత వరకు అతీగతీ లేదు.

– గోలనాయక్, రైతు, కుచినెర్ల, కేటీదొడ్డి మండలం

గడువులోగా పనులు..



గట్టు ఎత్తిపోతల పనులను గడువులోగా పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. అలాగే ర్యాలంపాడు జలాశయం మరమ్మతుపై నెలాఖరు నాటికి ప్రభుత్వం నుంచి తుది నిర్ణయం వస్తుంది. ఈ మేరకు పనులు చేపడతాం. అలాగే ర్యాలంపాడు జలాశయం మరమ్మతుకు గట్టు ఎత్తిపోతలకు నీళ్ల తరలించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అలాగే భూ సేకరణ సమస్య త్వరగా పూర్తి చేసి పనులు పూర్తి చేస్తాం.

– శ్రీనివాసరావు, ఎస్‌ఈ జిల్లా ఇరిగేషన్ శాఖ

మహనీయుడు.. బసవేశ్వరుడు



మహాత్మా బసవేశ్వరుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అధికారులు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: కుల, మత, వర్గ విభేదాలను వీడి సమానత్వంతో జీవించాలని చాటిచెప్పిన మహనీయుడు బసవేశ్వరుడని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనియాడారు. మహాత్మా బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని ఆదివారం సమీకృత కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బసవేశ్వరుడి ఆలోచన విధానాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. మహనీయులు ఎంతో అనుభవంతో చెప్పిన జీవన విధాన పద్ధతులను భవిష్యత్ తరాలకు అర్థమయ్యేలా ఆచరణలోకి తీసుకొద్దామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, బీసీడీఓ అనిల్‌కుమార్, ఏఓ రాజేందర్‌గౌడ్, వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు భాగ్యరాజు, ఉపాధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడికి ఘన నివాళి..



బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆదివారం విశ్వగురువు బసవేశ్వరుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీరశైవ సంప్రదాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి కుల, మత, వర్గ వ్యవస్థను రూపుమాపేందుకు పాటుపడిన బసవేశ్వరుడి సేవలు మరువలేనివన్నారు. స్త్రీ, పురుష అసమానతలను తొలగించడానికి, బాల్య వివాహాలను అరికట్టేందుకు పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో కవులు గిరి రాజాచారి, విభూది ఈశ్వర్, నాగరాజు, ప్రజా, కుల సంఘాల ప్రతినిధులు వెంకటస్వామి, దేవన్న నాయుడు, వీరశైవ, మహేశ్వరం, మల్లికార్జునయ్య, శివప్రసాద్, అంబికాదేవి, రాజేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఖిల్లాఘనపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఖిల్లాఘనపురం: తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రైతు సమన్వయ సమితి కో–ఆర్డినేటర్ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురం, పర్వతాపురం, మామిడిమాడ, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, అల్లమాయపల్లిలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు వెంకటరమణ, మోహన్, కృష్ణవేణి, శాంత, శేషయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకే రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరలకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, జిల్లా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ బాలీశ్వర్‌రెడ్డి, మండల రైతు సమితి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు, మండల సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యం, సింగిల్‌విండో వైస్ చైర్మన్ క్యామ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్, సింగిల్‌విండో కార్యదర్శి ప్రకాష్, ఏఈఓ శంకరమ్మ, ఉప సర్పంచ్ చంద్రకళ పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం లావాదేవీలు ప్రారంభం కానున్నాయి. శనివారం రంజాన్, ఆదివారం సెలవుతో కలిపి రెండు రోజులుగా మార్కెట్ బంద్ చేశారు. తిరిగి సోమవారం మార్కెట్ యార్డులో ఈనామ్ టెండర్ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యంతోపాటు ఆముదాలు మార్కెట్‌కు వస్తున్నాయి.

ఎస్సీ గురుకులాల యూజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ డిగ్రీ గురుకులాల్లో సీట్ల భర్తీకి గత నెల 3న నిర్వహించిన యూజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలో మహబూబ్‌నగర్ మండలం రాంరెడ్డిగూడెం ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థిని నవ్యశ్రీ రాష్ట్ర స్థాయిలో మొదటిర్యాంకు సాధించింది.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి



ఎర్రగట్టుతండాలో గిరిజనులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి

గోపాల్‌పేట: ఎవరెన్ని పన్నాగాలు పన్నినా.. కుతంత్రాలు చేసినా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హాథ్‌సే హాథ్ జోడోయాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని ఎర్రగట్టుతండాలో పర్యటించారు. గిరిజనులను కలిసి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేసే పనులను వివరించారు. అనంతరం గోపాల్‌పేటలో తిరిగి చివరకు బస్టాండులోని రావిచెట్టు వద్ద సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులను ప్రజలు ఒకసారి గుర్తు చేసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. రెండు లక్షల పంట రుణమాఫీ, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, రైతులు, కౌలు రైతులకు ఏటా రూ.15 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

వీఓఏలకు అండగా ఉంటాం

గోపాల్‌పేట: కష్టపడి పనిచేస్తున్న వారిని గుర్తించకుండా నిరాశపర్చడం తెలంగాణ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మెలో పాల్గొని వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. వీఓఏలకు తగిన పారితోషికం ఇవ్వకపోవడం అన్యాయమని.. సమ్మెకు కాంగ్రెస్‌పార్టీ తరఫున మద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. ఆరురోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీఓఏలకు అండగా ఉంటాం..

వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపి వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు అండగా ఉంటామని బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ ఇన్‌చార్జ్ నాగనమోని చెన్నరాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మెలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. అక్కడి నుంచే బీఎస్పీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. ప్రభుత్వానికి బహిరంగలేఖ రాస్తామని ఆర్‌ఎస్ చెప్పారని తెలిపారు.

యురేనియం తవ్వకాలు చేపడితే ఉద్యమిస్తాం

మన్ననూర్: నల్లమలలో యురేనియం తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదని రాజ్యసభ సభ్యుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివవర్మ డిమాండ్ చేశారు. ఆదివారం మన్ననూర్ అంబేడ్కర్ కూడలిలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వర్ధం సైదులుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. యురేనియాన్ని వెలికి తీసేందుకు కేంద్రం సుముఖంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదని పక్షం క్రితం రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. నల్లమలలో యురేనియం తవ్వకాలు చేపడితే రెండు, మూడు రాష్ట్రాల్లో దుష్ప్రభావం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నల్లమలను నాశనం చేసి ఆదానీ, అంబానీలకు ధారాదత్తం చేయాలని చూస్తుందని, ఈ ప్రాంతాన్నే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలకు నష్టం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణమంటున్న పోలీసులు


తిరుపతి (ఫైల్)

కొల్లాపూర్ రూరల్/చిన్నంబావి: భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని ఓ వ్యక్తిని భర్త కత్తితో గొంతుకోసి చంపిన ఘటన కొల్లాపూర్ మండలం చుక్కాయపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ యాలాద్రి కథనం మేరకు.. చిన్నంబావి మండలం పెద్దదగడకు చెందిన అడ్డాకుల తిరుపతి (33) గ్రామానికి చెందిన మేనుగొండ నిరంజన్ భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండేవాడు. పలుమార్లుపంచాయితీలు కూడా జరిగాయి. నిరంజన్ రెండునెలల క్రితం చిన్నంబావి పోలీస్‌స్టేషన్‌లో కూడా తిరుపతిపై ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి మార్పు లేకపోవడంతో శనివారం రాత్రి చుక్కాయపల్లిలో నిరంజన్ కాపుకాసి తిరుపతిని కత్తితో పొడిచి గొంతుకోసి చంపాడు. ఘటన స్థలాన్ని సీఐ యాలాద్రి, ఎస్ఐ బాలవెంకటరమణ పరిశీలించారు. తిరుపతి భార్య సంతోషి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

యువకుడి బలవన్మరణం

ఊర్కొండ: పురుగుమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నర్సంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణ్ కథనం మేరకు.. తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లికి చెందిన కాలె చంద్రయ్య (28) అతడి భార్య దేవి ఊర్కొండ మండలం నర్సంపల్లిలో ఉన్న కోళ్ల ఫారంలో పని చేస్తున్నారు. భార్యాభర్తలు గొడవ పడటంతో మనస్తాపానికి గురై చంద్రయ్య కోళ్ల ఫారంలో ఉన్న పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

కూలిన ఇంటి పైకప్పు



జడ్చర్ల టౌన్: మండలంలోని యాసాయికుంట తండాలో ఆదివారం తెల్లవారుజామున ఇంటి పైకప్పు కూలిన ఘటనలో ప్రమాదం తప్పినట్లయ్యింది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఇళ్లు తడిసింది. ఇంటి యజమాని జర్పులావత్ రవినాయక్ అతడి భార్య కవిత, ముగ్గురు పిల్లలు రోజులాగే ఇంట్లో నిద్రిస్తున్నారు. తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఇంటి పైకప్పు నుంచి శబ్దం రాగానే వారంతా ఒక్కసారి మేల్కొన్నారు. పైకప్పు కూలుతుండటంతో బయటకు పరుగులు తీశారు. పైకప్పు మొత్తం కూలిపడటంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితుడిని ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

కోయిల్‌సాగర్‌లో వ్యక్తి మృతి

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో ఈతకొడుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. చిన్నచింతకుంటకు చెందిన ఇస్మాయిల్ (32) రంజాన్ పండుగ కోసం తన అత్తగారు ఊరు మహబూబ్‌నగర్ వచ్చాడు. పండుగ అనంతరం ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చారు. ఈత కొట్టేందుకు ఇస్మాయిల్ నీటిలో దిగాడు. చేపలు పట్టడానికి వేసిన వల కాళ్లకు చుట్టుకుని నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందడంతో పోలీసులు ప్రాజెక్టు వద్దకు చేరుకుని నీటిలో మునిగిపోయిన ఇస్మాయిల్ శవాన్ని బయటికి తీశారు. జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నల్లమలలో కార్చిచ్చు

- అగ్ని కీలల్లో అటవీ సంపద
- ప్రశ్నార్థకంగా మారుతున్న జీవ వైవిధ్యం
- సంరక్షణ చర్యలు చేపడితేనే భద్రం
- చోద్యం చూస్తున్న అధికారులు


అడవిలో వ్యాపించిన మంటలు ఆర్పుతున్న సిబ్బంది (ఫైల్)

అచ్చంపేట: మొక్కలు నాటాలని హరితహారం పేరిట ప్రభుత్వం ఒక వైపు కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే.. మరోవైపు క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల విలువైన అటవీ సంపద అగ్నికి ఆహుతి అవుతోంది. వేసవికాలం కావడంతో నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో ప్రతి రోజూ ఎక్కడో ఒక్క దగ్గర కార్చిచ్చుతో అడవులు దహనం అవుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో దాదాపు 20 ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఎండుటాకులు, వృక్షాలు తగలబడుతున్నాయి. మంటల్లో చిక్కుకొని అనేక మూగజీవాలు బలవుతున్నాయి. ఎక్కడ చిన్న అగ్గి రాజుకున్నా అడవంతా విస్తరిస్తుంది. రాత్రి సమయాల్లో చూస్తే గుట్టలపై దీపాల వరుసలా మంటలు కనిపిస్తాయి. దీంతో పొగ, వేడి వ్యాపించి పొగతో కలిసిన గాలి పీల్చుకుని చెంచులు శ్వాస సంబంధవ్యాధుల బారిన పడుతున్నారు. ఏటా వేసవిలో ఈతంతు పరిపాటిగా మారింది. ఈ మంటల దాటికి పచ్చదనం బూడిద అవుతోంది. అడవులకు అంటుకున్న నిప్పును చల్లార్చడంలో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారు. వందల హెక్టార్లలో దగ్ధమైపోతున్నా ప్రేక్షకపాత వహిస్తున్నారు. వేసవికాలం వచ్చిందంటే నల్లమల అటవీ ప్రాంతంలో ఎక్కడ చూసినా అడవి కాలుతూ కనిపిస్తుంది. గంటల వ్యవధిలో మంటలు వ్యాపించి వేలాది ఎకరాల్లో నష్టం వాటిల్లుతోంది.

వన్యప్రాణుల విలవిల

నల్లమల అటవీ ప్రాంతం 2,611.39 చ.కి.మీ. విస్తీర్ణంలో విస్తరించి ఉండగా 2,166.37 చ.కి.మీ.లో అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఉంది. ఈ ప్రాంతంలో 30వరకు పులులు, వందకు పైగా చిరుతలు, 8 వేల సాంబర్లు, 2,200 గడ్డి జింకలు, వందల సంఖ్యలో ఎలుగుబంట్లు, కుక్కలు, కొండ గొర్రెలు, వేల సంఖ్యలో అడవి పందులు, నెమళ్లు, మనుబోతులు, కోతులు, మచ్చల జింకలు, నక్కలు, తోడేళ్లు ఉన్నాయి. అడవిలో మంటలు చెలరేగడం వల్ల పలు వన్యప్రాణులు విలవిలాడుతున్నాయి. ప్రాణాలను రక్షించుకునేందుకు పరిసరాల గ్రామాల్లోకి పరుగులు తీస్తున్నాయి. అలా అవీ వేటగాళ్ల ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. జీవవైవిధ్యానికి ముప్పుగా పరిణమిస్తోంది.

ఎవరి తప్పిదం

మానవ నిర్లక్ష్యమో..మరేదైనా కారణమో కానీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్ని ఏళ్ల నాటి చెట్లు, విలువైన ఔషధ మొక్కలు కాలి అంతరించిపోతున్నాయి. ఒకప్పుడు నల్లమల అడవిలో శతావరి, షుగర్‌ను నియంత్రించే పొడపత్రి లాంటి మొక్కలు విరివిగా లభించేవి. ఇప్పుడు వెతుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అడవుల్లో తిరిగే వ్యక్తులు పొగతాగి.. బీడీ, సిగిరెట్ లాంటివి ఆర్పివేయకుండానే పడేయడం వల్ల అగ్ని రాజుకుంటోంది. అడవి జంతువులు పరుగెత్తగడం వల్ల రాళ్లకు కాళ్లు తగిలి మంటలు రావడం లాంటివి జరుగుతుంటాయి. అదే విధంగా వేప, దేవదారు, నల్లమద్ది వంటి గట్టి చెట్లు ఒకదానికొకటి రాసుకోవడం వల్ల కూడా మంటలు వ్యాపించే అవకాశం ఉంది. నల్లమల ప్రాంతంలో జరిగే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా కార్చిచ్చు వల్లనే జరుగుతున్నాయనేది ఒక అంచనా.

అధికారుల నిర్లక్ష్యం

అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే అడవులు దహనం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడవుల్లో మంటలు రేగినప్పుడు ఆర్పేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విలువైన వృక్ష సంపద కాలి బూడిదవుతుంది. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఉరుకులు, పరుగులు పెడుతున్నారే గానీ ముందస్తుగా చర్యలు చేపట్టడం లేదు. కార్చిచ్చులు సంభవించినప్పుడు అడవిలో జంతువులు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వన ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం కావడంతో అడవిలోని వాగుల్లో నీరు ఇంకిపోవడంతో అడవి జంతువులు సంచరిస్తుంటాయని, మంటల వ్యాప్తితో వాటికి ఆపాయం జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు.

అగ్ని ప్రమాద ఘటనలు ఇలా..

- ఫిబ్రవరి 2న హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిలోని దోమలపెంట రేంజ్‌లోని తోసిపెంట వద్ద ఐదు హెక్టార్ల వరకు అడవి అగ్గికి ఆహుతైంది.
- ఈనెల 18న రాత్రి తాటి గుండాల వద్ద వ్యాపించిన మంటలు ఈర్లపడేల్, లంబడోని ఉతార్, జీలుగాయి కుంట, శుద్ధ బొక్కల వరకు 60 హెక్టార్లలో మంటలు వ్యాపించగా ఫైర్‌లైన్ సిబ్బంది ఎనిమిది గంటల పాటు కష్టపడి ఆర్పేశారు. ఇందులో అరుదైన వృక్షాలు, పక్షులు, అటవీ జంతువులు కాలి బూడిదయినట్లు తెలిసింది.
- ఈనెల19న మన్ననూర్ రేంజ్ పరిధిలోని పుల్లాయిపల్లి బ్లాక్‌లోని 345 కంపార్ట్‌మెంట్, అమ్రాబాద్ రేంజ్ పరిధిలోని లక్ష్మాపూర్ బ్లాక్‌లోని నర్రపెంట బీట్ కంపార్ట్‌మెంట్ 167లో మంటలు చేలరేగాయి.
- ఈనెల 20న దోమలపెంట రేంజ్ పరిధిలోని సంగిండిగుండాల బీట్‌లో 361 కంపార్ట్‌మెంట్‌లో మంటల చెలరేగాయి. అదే రోజు సాయంత్రం అమ్రాబాద్ మండలం తిర్మలాపూర్(బికె)సమీప అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించాయి. దాదాపు రెండుహెక్టార్ల అడవి కాలిపోయింది.

అవగాహన కల్పిస్తున్నాం..



అమ్రాబాద్ టైగర్ రిజర్వులో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ముందుస్తుగా ఫైర్‌లైన్ల ఏర్పాటు చేశాం. అటవీశాఖ అధికారులు, సిబ్బంది బేస్ క్యాంపు వాచర్లు, క్విక్ రెస్పాండ్ టీం సభ్యులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఎయిర్ బోయర్లతో మంటలు అదుపు చేస్తున్నారు. ఎక్కడైన మంటలు చెలరేగిప్పుడు పసిగట్టేందుకు వాచ్ టవర్లు ఏర్పాటు చేశాం.

– రోహిత్‌రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి

నల్లమలలో అడవి దున్న ప్రత్యక్షం


నల్లమల అభయారణ్యంలో అడవి దున్న

మన్ననూర్: నల్లమలలోని అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో అడవి దున్న (మగ) కనిపించింది. కర్ణాటక రాష్ట్రంలో ఉండే ఈ అడవి దున్నలు నల్లమలలో కనిపించడం ఇదే మొదటిసారి. అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వన్యప్రాణుల నిర్ధారణ కోసం అటవీ పరిసర ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లను అటవీశాఖ ఉపయోగిస్తుంది. ఈ క్రమంలో భౌరాపూర్ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ట్రాప్‌లో అడవిదున్న కనిపించిందని అటవీ శాఖాధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా దున్న గత నెలలో మహబూబ్‌నగర్ పరిసర ప్రాంతంలో అక్కడి ప్రజలకు కనిపించడంతో అటవీశాఖ అధికారులకు అప్పట్లో సమాచారం కూడా ఇచ్చినట్లు తెలిసింది. నెల రోజుల తర్వాత తిరిగి నల్లమలలో అడవిదున్న కనిపించిందని పేర్కొన్నారు. కర్ణాటకలో ఉండే అడవి దున్న దారి తప్పి మక్తల్, నారాయణపేట, మహబూబ్‌నగర్ మీదుగా నల్లమలలోకి ప్రవేశించినట్లు తెలుస్తుందన్నారు. అడవిదున్న కదలికలను కనిపెట్టేందుకు డీఎఫ్ఓ రోహిత్ గోపిడీ ఆదేశాల మేరకు మన్ననూర్ రేంజ్ అధికారి ఈశ్వర్, డిప్యూటీ రేంజర్ రవికుమార్, బయాలజిస్టు మహేందర్, సిబ్బందితో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఖుషి టీవీకి చిన్నారి ఎంపిక


తన్వికను అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల రూరల్: చిన్నపిల్లలను అలరించే ప్రముఖ టీవీ ఛానల్ ఖుషి టీవీకి గద్వాలకు చెందిన చిన్నారి తన్విక ఎంపికైంది. ట్రాఫిక్ నియమాలపై రైమ్స్, 20 ఎక్కాలను నాలుగు నిమిషాలలో ఎలాంటి తడబాటు లేకుండా ఐదున్నర సంవత్సరాల వయసున్న తన్విక చెప్పి రికార్డు సృష్టించింది. ఈ మేరకు తన్వికను జెడ్పీ చైర్‌పర్సన్ కె.సరిత, అదేవిధంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అభినందించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గద్వాలకు చెందిన పట్నం నరసయ్య కుటుంబసభ్యులు వెంకంపేట శివారు సర్వేనంబర్ 98లో 3.36 ఎకరాల వ్యవసాయ భూమిపై తమకు హక్కులు ఉన్నట్లు గద్వాల కోర్టును ఆశ్రయించారు. అదే పొలంపై తమకే హక్కులు ఉన్నాయని గద్వాలకు చెందిన దాసరి గోవర్ధనమ్మ, వారి కుటుంబ సభ్యులు సైతం గద్వాల కోర్టును ఆశ్రయించారు. ఈ భూ వివాదంపై గతంలోనే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఇరువురి వాదనలు విన్న గద్వాల సివిల్‌కోర్టు న్యాయమూర్తి పట్నం నరసయ్యకు చెందిన భూమిగా తీర్పునిచ్చారు. అలాగే వారికి రక్షణ కల్పించాల్సిందిగా గద్వాల రూరల్ పోలీసులను ఆదేశించింది. హక్కుదారులు పొలానికి కంచె ఏర్పాటు చేస్తుండగా విషయం తెలుసుకున్న దాసరి గోవర్ధనమ్మ, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని అభ్యంతరం తెలిపారు. పోలీసులు వారిని శాంతింపజేసి వివాదం జరగకుండా కట్టడి చేశారు. ఈ క్రమంలో దాసరి శ్రీనివాసులు తనకు అన్యాయం జరిగిందని మనస్తాపానికి గురై పురుగుమందు తాగేందుకు యత్నించాడు. వెంటనే పోలీసులు పురుగుమందు డబ్బాను లాక్కున్నారు. ఈ క్రమంలో కళ్లు, శరీరంపై మందు పడటంతో వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసు వాహనంలో తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కోర్టు అనుమతితో పొలంలో హద్దులు ఏర్పాటు చేస్తుండగా భయభ్రాంతులకు గురి చేయడంపై పట్నం నరసయ్య కుటుంబీకులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ వివరించారు.

పాముకాటుకు విద్యార్థి మృతి


దినేష్ (ఫైల్)


కాటువేసిన పాము

మద్దూరు: పాముకాటుకు గురై ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చంద్ర్యనాయక్ తండాలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోస్గి మండలంలోని మీర్జాపూర్ గ్రామానికి అనుబంధ ఉండే పీసీతండాకు చెందిన హరినాయక్ ఆర్థిక పరిస్థితి బాగా లేక కుటుంబంతో ముంబై వలస వెళ్లాడు. ఆయన కొడుకు పి.దినేష్(10)ను మద్దూరు మండలంలోని చంద్ర్యనాయక్ తండాలోని వదిన దేవి బాయి దగ్గర ఉంచాడు. పెద్దమ్మ దగ్గర ఉంటూ పల్లెర్ల ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. శనివారం ఇంటి బయట నిద్రించాడు. వర్షం పడడంతో ఇంట్లోకి వెళ్లి పడుకున్నాడు. ఈ క్రమంలో పాముకాటు వేసింది. ఈ విషయాన్ని పెద్దమ్మ దేవిబాయికి తెలుపడంతో తండాలోనే నాటు వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో నారాయణపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. చలాకీగా ఉండే బాలుడు మృతి చెందడంతో తండాలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

క్రీడాపోటీలతో మానసిక ఉల్లాసం


క్రీడా జట్లతో రీజినల్ మేనేజర్ తదితరులు

- ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ జి.సుభాష్
- బ్యాంక్ ఉద్యోగులకు క్రీడా పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడా పోటీలతో ప్రతిఒక్కరిలో మానసికోల్లాసం పెంపొందుతుందని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ సుభాష్ అన్నారు. ఏపీజీవీబీ మహబూబ్‌నగర్ రీజియన్ ఉమ్మడి జిల్లాలోని 50 బ్రాంచ్ కార్యాలయాల ఉద్యోగులకు రెండు రోజుల నుంచి జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ స్టేడియంలో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏపీజీవీబీ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తూ తీవ్ర ఒత్తిడిలో ఉంటారని, ఏడాదికోసారి వారందరినీ ఒకచోటికి చేర్చి ఉల్లాసంగా గడిపే విధంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతేడాది కూడా క్రికెట్ టోర్నీ నిర్వహించినట్లు తెలిపారు. క్రీడలతో ఉద్యోగుల్లో ఉల్లాసంతో పాటు క్రీడా నైపుణ్యం బయటికి వస్తుందన్నారు. తమ బ్యాంకులో పనిచేసే ఉద్యోగులందరూ ఒక కుటుంబంలా అందరూ కలుసుకునే ఒక చక్కని వేదిక అన్నారు. చీఫ్ మేనేజర్ కె.శ్రీనివాస్, సీనియర్ మేనేజర్ గోపాల్ నాయక్, ఉద్యోగుల యూనియన్ రీజినల్ కార్యదర్శి వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజేత మహబూబ్‌నగర్ ఎస్ఆర్ఎం..

క్రికెట్ టోర్నీలో మహబూబ్‌నగర్ సన్‌రైజర్స్, జడ్చర్ల రాయల్ చాలెంజర్, నారాయణపేట నైట్‌రైడర్స్, కొడంగల్ సూపర్ కింగ్స్ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ ఎస్ఆర్ఎం జట్టు ఆరు వికెట్ల తేడాతో నారాయణపేట జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నారాయణపేట జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 19.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసి విజేతగా నిలిచింది. అనంతరం విన్నర్, రన్నప్ జట్లకు రీజినల్ మేనేజర్ ట్రోఫీలు అందజేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

మహమ్మదాబాద్: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతిచెందాడు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన అభిలాష్(23), మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం నాగంపేటకు చెందిన రాకేష్ గ్యాస్ రెగ్యులేటర్లు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గండేడ్ మండల కేంద్రంలో వారం క్రితమే ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని ఇక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం ఇరువురు కలిసి కోస్గి వెళ్తుండగా సల్కర్‌పేట గ్రామం దాటగానే అదుపు తప్పి బైక్ పక్కన ఉన్న చెట్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అభిలాష్ అక్కడికక్కడే మృతిచెందగా.. వెనక కూర్చున్న రాకేష్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆదివారం మృతేదహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదయ్య తెలిపారు.

బైకు, ఆటో ఢీకొని..

గోపాల్‌పేట: బైకు, ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని నర్సింగాయపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చెన్నూరు వెనికితండాకు చెందిన రెడ్యానాయక్(43) వనపర్తి నుంచి తండాకు వస్తుండగా.. బండపల్లికి చెందిన వారు నాయినోనిపల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో నర్సింగాయపల్లి గ్రామ సమీపంలో ఆటో, బైకు ఎదురెదురుగా ఢీకొనడంతో రెడ్యానాయక్ తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే వనపర్తి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రెడ్యానాయక్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉండగా.. కూతురుకు పెళ్లి అయిందని సమాచారం.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

కొల్లాపూర్ రూరల్: శుభకార్యానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా.. మండలంలోని సంగోటం గ్రామానికి చెందిన సెద్ద సుంకులయ్య(45) కల్వకోల్‌లో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో అంకిరావుపల్లి సమీపంలో అగ్రహారం దగ్గర ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ బాలవెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సుంకులయ్యకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవాబుపేట: పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిందని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. అయన కథనం మేరకు.. మండలంలోని కూచూర్‌కు చెందిన కుర్వ పార్వతమ్మ (45) కడుపునొప్పి భరించలేక ఈ నెల 18న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుమందు తాగింది. అరుపులు, కేకలు విని పక్కనే ఉన్న బంధువులు వచ్చి 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. అన్న కుర్వ మల్లప్ప ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కోడెదూడలు తరలిస్తున్న వాహనం పట్టివేత

జడ్చర్ల: కోదాడ నుంచి కర్నూలుకు డీసీఎం వాహనంలో అనుమతి లేకుండా 23కోడె దూడలను తరలిస్తున్న వాహనాన్ని పట్టణంలో పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కర్నూలు జిల్లా రేమట గ్రామానికి డీసీఎం వాహనంలో కుక్కి తీసుకెళ్తుండగా, సమాచారం అందుకున్న పోలీసులు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన చాకలి రాముడు, అశోక్, చిలుక రాముడు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేశామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని చెదురుపల్లి వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. చెదురుపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు వాగునుంచి అక్రమంగా ఇసుకను వెల్దండ మండల కేంద్రానికి తరలిస్తున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ గమనించి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని వెల్దండకు తరలించారు. ట్రాక్టర్ యజమానులతో పాటు డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కాటన్‌మిల్‌లో అగ్నిప్రమాదం

జడ్చర్ల టౌన్: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని మహేష్ కాటన్‌మిల్‌లో ఆదివారం మధ్యాహ్నం 3.30 ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఎండలు మండుతుండటంతో యంత్రాల వేడికి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గుర్తించిన సిబ్బంది అక్కడే ఉన్న యజమానికి సమాచారం ఇచ్చారు. ఆయన అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయటంతో ఫైర్‌సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో కొన్ని పత్తి సంచులు తగలబడిపోయాయి.


మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

వేసవి దుక్కులు.. లాభాలు దక్కు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


వేసవి దుక్కి దున్నుతున్న రైతు

అలంపూర్: సాగు ఆరంభంలో చేసే కొన్ని పనులు దిగుబడిపై ప్రభావం చూపుతాయి. అటువంటి వాటిలో వేసవి దుక్కులు ప్రధానమని ఏడీఏ సక్రియనాయక్ సూచిస్తున్నారు. వేసవి దుక్కుల లాభాల గురించి ఆయన రైతులకు వివరించారు.

పోషకాల పెంపు

నేలలోపలి గట్టి పొరలను పగులగొట్టడం వలన మొక్కల వేరు వ్యవస్థ లోపలికి చొచ్చుకుని వస్తాయి. వేరు వ్యవస్థ నేలలోకి బాగా విస్తరించడం వలన మొక్కల ఎదుగుదలకు కావాల్సినంత తేమ పోషకాలు సమకూరుతాయి. దీంతో నాణ్యమైన దిగుబడి వస్తుంది. పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవుల చర్యలను కూడా అభివృద్ధి పరిచేందుకు ఈ వేసవి దుక్కులు తోడ్పడతాయి.

కలుపు నివారణ

లోతు దుక్కుల వలన పొలంలో ఉండే మొండి జాతి కలుపు మొక్కలైన గరిక, తుంగ ఇతరవి దుంపలతో సహా పెకిలించవచ్చు. దీంతో అవి ఎండిపోయి కలుపు సమస్య తగ్గుతుంది.

పురుగుల నిర్మూలన

తొలకరి వర్షాలు పడిన వెంటనే భూమిని లోతుగా దున్ని కింది నేలను పైకి వచ్చేట్లు చేయడం వలన నిద్రావస్థలో ఉన్న వివిధ పురుగుల గుడ్లు, ప్యూపాలు సూర్యరశ్మి తాకిడికి చనిపోతాయి. వేసవి దుక్కుల వలన వరి పైరును ఆశించే కాండం తొలుచు పురుగు మొక్కజొన్నలో వచ్చే పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు.

తెగుళ్ల నివారణ

భూమిలో ఉండి సాగుకాలంలో పైరును ఆశించే వివిధ రకాల శిలింద్రాలు వేసవిలో చేపట్టే లోతు దుక్కుల వలన ఎండ తాకిడికి చనిపోతాయి. తర్వాత పంట కాలంలో ఈ తెగుళ్ల తీవ్రత తగ్గుతుంది. ఉదాహరణకు వివిధ పంటల్లో వచ్చే ఎండు తెగుళ్లను వేసవి దుక్కుల వలన తగ్గుముఖం పట్టించవచ్చు.

ఇతర ప్రయోజనాలు..

- ప్రాథమికంగా వేసవి దుక్కుల వలన తొలకరిలో పడే వర్షపు నీరు నేలలోకి బాగా ఇంకి భూగర్భ నీటి మట్టం పెరుగుతుంది. దీంతోపాటు నేలలో తేమ నిల్వ శాతం వృద్ధి చెందుతుంది.
- నీరు బాగా ఇంకడం వలన నేల గుల్లబారి విత్తనం నాటేందుకు అనుకూలంగా మారుతుంది. తద్వార మొలక శాతం పెరుగుతుంది.
- ముందు పంట మొదళ్లు, చెత్త ఆకులు, నేలలో కలిసి సేంద్రియ పదార్థంగా మారి నేల సారం పెరుగుతుంది.

వేసవి దుక్కితో లాభాలు

- నేల గుల్లబారి నీటి నిల్వ శాతం పెరుగుతుంది.
- భూమి లోపల ఉండే వివిధ రకాల పురుగుల గుడ్లు, ప్యూపాలు చనిపోతాయి.
- కలుపును నివారించవచ్చు.

క్లుప్తంగా...

వివేకా కేసులో ఐదో రోజూ కొనసాగిన విచారణ

- భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించిన సీబీఐ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా వరుసగా ఐదో రోజు కూడా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. వారిని ఆదివారం ఉదయం 9.15 గంటలకు హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు నుంచి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. సాయంత్రం 4.20 గంటలకల్లా విచారణను పూర్తి చేసి.. వారిద్దరినీ తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

పులివెందులలో సీబీఐ విచారణ

- పలు ప్రాంతాలను పరిశీలించిన దర్యాప్తు అధికారులు



వైఎస్ వివేకా ఇంటి వద్ద కంప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాతో సీబీఐ అధికారులు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఆదివారం సాయంత్రం సీబీఐ అధికారులు వైఎస్సార్ జిల్లా పులివెందులకు వచ్చారు. తొలుత వివేకా ఇంటి వద్దకు వెళ్లి.. బయటి నుంచే పరిసరాలను పరిశీలించారు. ఆ తర్వాత వైఎస్ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి.. అక్కడ ఉన్న పీఏ రమణారెడ్డితో మాట్లాడారు. అనంతరం మళ్లీ వివేకా ఇంటికి వచ్చి.. కంప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాను తమ వాహనంలో ఎక్కించుకుని కొద్దిసేపు అక్కడే విచారించారు. ఆ తర్వాత ఇనయతుల్లాను తీసుకొని మళ్లీ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జమ్మలమడుగు ప్రచారానికి వెళుతూ ఘటన గురించి తెలిసిన వెంటనే తిరిగొచ్చిన స్థలాన్ని చూపించాలని పీఏ రమణారెడ్డిని సీబీఐ అధికారులు కోరారు. దీంతో రమణారెడ్డి రింగ్ రోడ్డులోని కృష్ణ టెంపుల్ సమీపంలో ఉన్న ప్రాంతాన్ని సీబీఐ అధికారులకు చూపించాడు. ఆ ప్రాంతాన్ని చూసిన అనంతరం సీబీఐ అధికారులు వివేకానందరెడ్డి ఇంటి లోపలికి వెళ్లి పరిశీలించారు. ఇనయతుల్లాను అక్కడే వదిలేసి కడపకు వెళ్లిపోయారు.

తప్పు ఒప్పుకున్నా ఇంకా సమర్థిస్తారా?

రామోజీ నిర్వాకాలపై నిలదీసిన న్యాయ కోవిదులు, ప్రముఖులు

- మార్గదర్శి అక్రమాలు–నిజానిజాలపై విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక సదస్సు



సదస్సులో ప్రముఖులు, న్యాయ కోవిదులు



మాట్లాడుతున్న ఉండవల్లి

సాక్షి, అమరావతి: మార్గదర్శి సంస్థ వ్యవహారాల విషయంలో చట్టాన్ని ఉల్లంఘించినట్లు విచారణలో రామోజీరావే అంగీకరించాక కొందరు ఇంకా ఆయన్ను సమర్థించేందుకు ప్రయత్నించడం అసంబద్ధమని న్యాయ నిపుణులు స్పష్టం చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ చట్ట విరుద్ధంగా చందాదారుల సొమ్మును జాతీయ బ్యాంకుల్లో కాకుండా తమ అనుబంధ సంస్థలు, ఇతర చోట్ల పెట్టుబడిగా పెట్టినట్లు రామోజీనే అంగీకరించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈనాడు పత్రికను అడ్డం పెట్టుకుని మార్గదర్శి ఫైనాన్షియర్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో అక్రమాలకు పాల్పడుతుంటే చట్టం కళ్లు మూసుకుని చూస్తూ ఊరుకోదని తేల్చి చెబుతున్నారు. 'రామోజీరావు మార్గదర్శి అక్రమాలు – నిజానిజాలు' అనే అంశంపై ఆదివారం విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక నిర్వహించిన సదస్సులో పలువురు ప్రముఖులు, న్యాయ కోవిదులు పాల్గొని మాట్లాడారు.

ఉపేక్షిస్తే మాఫియా సామ్రాజ్యమే: ఉండవల్లి

రామోజీరావు ఆగ్రహిస్తేనో, ఈనాడు పత్రికల్లో వ్యతిరేకంగా రాస్తేనో ఏదో జరిగిపోయే రోజులు పోయాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. గతంలో రాజమండ్రిలో తనను ఓడించేందుకు రామోజీ ఎంతో ప్రయత్నించినా తాను గెలిచానని గుర్తు చేశారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్ల కూడా ఈనాడు అలాగే వ్యవహరిస్తోందన్నారు. అయితే అప్పుడు జరిగిందే రేపు కూడా జరుగుతుందని వ్యాఖ్యానించారు. 'రామోజీరావు తాను చట్టాలను పట్టించుకోనంటారు. చట్టాలకు అతీతమన్నట్లుగా వ్యవహరిస్తారు. తనను ఎవరూ ప్రశ్నించడానికి వీల్లేదని వాదిస్తారు. తాను ఆర్థిక అక్రమాలకు పాల్పడినా అడగకూడదని వితండవాదం చేస్తారు. 60 ఏళ్లుగా తన అక్రమాలను ఎవరూ ప్రశ్నించలేదు కాబట్టి ఇప్పుడూ అడగడానికి వీల్లేదని చెబుతారు. రామోజీరావు లాంటి వారిని వదిలేస్తే దేశంలో అతిపెద్ద మాఫియా సామ్రాజ్యం తయారవుతుంది' అని ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.

నాడు మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్లు

'మార్గదర్శి ఫైనాన్సియర్స్ విషయంలోనూ 2006లో రామోజీరావు అడ్డగోలుగా వాదించారు. హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చన్న రామోజీ వాదనను ఆర్బీఐ సమ్మతించలేదు. ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. దీంతో తాము ప్రజల నుంచి రూ.2,600 కోట్లు డిపాజిట్లు సేకరించడం తప్పని రామోజీరావు ఆర్బీఐ వద్ద అంగీకరించారు. ఆ డిపాజిట్లను వెనక్కి ఇచ్చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. కానీ ఎవరెవరి నుంచి డిపాజిట్లు వసూలు చేశారో చెప్పమంటే వెల్లడించలేదు. ఆ డిపాజిట్‌దారుల వివరాలు తెలియచేయాలని ఇటీవలే సుప్రీం కోర్టు ఆదేశించింది.

హాయిగా మంచంపై పడుకుని..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను నిర్వహిస్తున్న రామోజీరావు అసలు తాను కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని పట్టించుకోనని సీఐడీ విచారణలో వాదించడం బరితెగింపే. చిట్‌ఫండ్ సంస్థలు తమ చందాదారుల నుంచి వసూలు చేసే సొమ్మును జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలని చట్టంలో ఉంది. కానీ ఆ నిధులను రామోజీరావు తన సొంత సంస్థల్లో పెట్టుబడిగా పెట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై రామోజీరావు, ఆయన కోడలిని విచారించేందుకు సీఐడీ అధికారులే వారి ఇంటికే వెళ్లాల్సి వచ్చింది. రామోజీరావు హాయిగా మంచంపై పడుకుని ఉంటే సీఐడీ అధికారులు ఏవో ప్రశ్నలు అడిగి వచ్చారు. దేశంలో ఇతరులకు అలా సాధ్యం అవుతుందా? పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తారు. రామోజీరావు కాబట్టి ఏదైనా చెల్లుతుంది.

అక్రమాలను ప్రశ్నిస్తే కక్షగట్టడమా?

మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రజల నుంచి రూ.2,600 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేస్తే రామోజీరావు గ్రూపు సంస్థలు రూ.1,850 కోట్లు నష్టం చూపించాయి. మరి రామోజీరావు బోర్డు తిప్పేస్తే డిపాజిట్‌దారుల పరిస్థితి ఏమిటని నేను అడగడం తప్పా? మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అక్రమాలను నేను ప్రశ్నిస్తే రామోజీపై కక్ష గట్టానని కొందరు ఆడిటర్లు, న్యాయవాదులు వాదిస్తుండటం విడ్డూరం. రామోజీరావుకు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు అసలు సంబంధం లేదంటూ రాజాజీ అనే వ్యక్తితో నాపై పరువునష్టం దావా వేయించారు. అప్పుడు ఈ ఆడిటర్లు, లాయర్లు ఒక్కరైనా మాట్లాడారా?

బాబు – రామోజీ క్విడ్ ప్రోకో

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా సరే అన్ని పార్టీలు రామోజీరావును కీర్తిస్తూ పోటీలు పడి మరీ ప్రకటనలు ఇస్తున్నాయి. చంద్రబాబు – రామోజీరావుకు మధ్య క్విడ్ ప్రోకో ఉంది. తన మాట వినలేదు కాబట్టే ఎన్టీఆర్‌ను ఈనాడు దించేసింది. ప్రస్తుతం చంద్రబాబు రామోజీ చెప్పినట్లే నడుస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్న వారంతా పోటీలు పడి మరీ రామోజీని సమర్థిస్తూ మాట్లాడుతున్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం జగన్ స్పందించారు

ఏపీ విభజన చట్టమే తప్పు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నేను సుప్రీంకోర్టులో కేసు వేశా. దానిపై ఏపీ ప్రభుత్వం తరపున ఇంప్లీడ్ కావాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఆయన్ను కలసి మరీ అభ్యర్థిస్తే పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని ఓ ప్రెస్‌మీట్‌లో కోరా. వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ కేసులో ఇంప్లీడ్ అవుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం వైఎస్ జగన్ స్పందించారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమాల కేసులో సుప్రీంకోర్టులో నేను వేసిన కేసులో ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యింది. టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఇంప్లీడ్ కాలేదు. ఎక్కడ కేసీఆర్ ప్రభుత్వం ఇంప్లీడ్ అవుతుందో అనే భయంతో రామోజీరావు ఈనాడులో టీఆర్ఎస్‌కు భజన చేస్తున్నారు. సచివాలయాన్ని నిర్మిస్తే మయసభ నిర్మించినట్టుగా పెద్ద పెద్ద వార్తలు వేసి కేసీఆర్‌ను ఖుషీ చేయడానికి ప్రయత్నించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సక్రమంగా వ్యవహరిస్తోంది. మార్గదర్శి అక్రమాల కేసును సమగ్రంగా విచారించి సరైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉంది.

టీడీపీతో చర్చకు సిద్ధంగా ఉన్నా

చంద్రబాబు, మార్గదర్శి వ్యవహారాలపై చర్చకు నేను సిద్ధంగా ఉన్నా. టీడీపీ అధికార ప్రతినిధి హోదాలో చంద్రబాబు ఎవరినైనా చర్చకు పంపాలి. సింగపూర్, దుబాయిలో చంద్రబాబు ఆస్తులు లాంటి కష్టమైన ప్రశ్నలు ఏవీ నేను అడగను. టీడీపీ ప్రభుత్వంలో వ్యవహారాలపైనే అడుగుతా. అని మాజీ ఎంపీ ఉండవల్లి అన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించామని అంగీకరించిన రామోజీ

మార్గదర్శి సంస్థ వ్యవహారాల విషయంలో చట్టాన్ని ఉల్లంఘించినట్టు రామోజీరావే అంగీకరించాక ఆయన తప్పు చేయలేదని ఇతరులు ఎవరో మాట్లాడటం అసంబద్ధమని సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్. సత్యనారాయణ ప్రసాద్ పేర్కొన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ చట్టాన్ని ఉల్లంఘించి చందాదారుల సొమ్మును జాతీయ బ్యాంకుల్లో కాకుండా ఇతర సంస్థల్లో పెట్టుబడి పెట్టినట్టు రామోజీరావే అంగీకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు సెక్షన్ 160 కింద నోటీసులు ఇవ్వడాన్ని కొందరు ఆడిటర్లు, న్యాయవాదులు ప్రశ్నించడం సరికాదని సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్.సత్యన్నారాయణ ప్రసాద్ స్పష్టం చేశారు. తమకు ఎవిడెన్స్ చట్టం 126 కింద మాత్రమే నోటీసులు ఇవ్వాలన్న వారి వాదన పూర్తిగా సత్యదూరమన్నారు. సెక్షన్ 126 అన్నది కేవలం ఒక అర్జీదారు, అతడి న్యాయవాదికి సంబంధించిన వ్యవహారాలకే వర్తిస్తుందన్నారు. కేసు అంశాలపై మాట్లాడినవారికి సెక్షన్ 160 కింద నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉంటుందని సోదాహరణంగా వివరించారు. ఈనాడు పత్రికను అడ్డం పెట్టుకుని మార్గదర్శి ఫైనాన్షియర్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలకు పాల్పడతామంటే ఎలా? అని సదస్సు నిర్వాహకుడు, ప్రముఖ పాత్రికేయుడు కేజీబీ తిలక్ ప్రశ్నించారు. చట్టాలు సక్రమంగా అమలయ్యేలా వాచ్‌డాగ్‌గా ఉండాల్సిన మీడియా కొందరి పెంపుడు కుక్కగా మారుతుండటం విషాదకరమన్నారు. సమాచార హక్కు చట్టం పూర్వపు కమిషన్ అంబటి సుబ్బారావు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్వ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డితోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సదస్సుకు హాజరయ్యారు.

ఇళ్ల నిర్మాణంలో ఏపీ భేష్

- పేదల ఇళ్ల కోసం ఏకంగా 68,677 ఎకరాలు పంపిణీ
- దేశంలో ఇంత పెద్ద ఎత్తున మరే రాష్ట్రంలోనూ ఇళ్ల స్థలాలివ్వలేదు
- కేంద్ర హౌసింగ్ – పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంసలు

సాక్షి, అమరావతి : పేదలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని కేంద్ర గృహ నిర్మాణ–పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 30 లక్షల మందికిపైగా పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ భూములను సేకరించి.. ఏకంగా 68,677 ఎకరాలు పంపిణీ చేసిందని కొనియాడింది. ఇళ్ల స్థలాల పట్టాలన్నీ మహిళల పేరుపై మంజూరు చేయడం ద్వారా వారి సాధికారతకు తోడ్పడుతోందని మెచ్చుకుంది. దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోనూ ఇంత పెద్ద ఎత్తున పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ జరగలేదని, వారందరికీ ఇళ్ల నిర్మాణం కోసం కొత్తగా ఏకంగా 17,005 జగనన్న కాలనీలను నిర్మిస్తోందని వివరించింది. దేశంలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లో 'సరసమైన గృహాలు – ఉత్తమ పద్ధతులు' అంశంపై అధ్యయనం చేసిన కేంద్ర గృహ నిర్మాణ – పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. ఇటీవల నివేదికను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అనుసంధానం చేసి, లబ్ధిదారులకు ప్రయోజనాలు అందిస్తోందని ఆ నివేదికలో పేర్కొంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనతో గృహాలకు ఎల్‌పీజీని, ప్రధానమంత్రి సహజ బిజిలీ హర్ ఘర్ యోజన కింద విద్యుత్, జలజీవన్ మిషన్ కింద తాగునీరు, జన్ ధన్ యోజన కింద బ్యాంకు ఖాతాలు ప్రారంభించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అండగా నిలిచిందని వెల్లడించింది. వీటితో పాటు మహిళా సాధికారతలో భాగంగా అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా ఆర్థిక సాయం చేస్తూ.. పిల్లలను చదివించేందుకు తల్లులకు అధికారం కల్పించే పథకాన్ని అమలు చేస్తోందని కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది.

తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ ఓ వరం

- కేన్సర్ నియంత్రణకు చర్యలు.. చికిత్సకు రూ.800 కోట్లు ఖర్చు
- రూ.3 కోట్లతో కార్మిక భవన్: హరీశ్



దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు అందజేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్/హుస్నాబాద్: ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హెల్త్ ప్రొఫైల్ వరం లాంటిదని, నిర్ధారణ పరీక్షల ద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించే అవకాశం ఉంటుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆదివారం డే కేర్ కీమోథెరపీ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...రాష్ట్రంలో మొట్టమొదటి డే కేర్ కీమోథెరపీ సెంటర్‌ను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రారంభించుకున్నామని, ఖమ్మం, కరీంనగర్, సిరిసిల్ల, వనపర్తిలో థెరపీ యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో ఎనిమిది వైద్య కళాశాలల్లో, అనంతరం 33 జిల్లాల్లో యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

50మందికి ట్రై మోటార్ సైకిళ్లు...

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని మంత్రి హరీశ్‌రావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో 50 మంది దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు పంపిణీ చేశారు. సిద్దిపేటలో కార్మిక దినోత్సవం రోజున రూ.3కోట్లతో కార్మిక భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాల్లో ఆయన పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో 1,002 రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పామని, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టారని తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి

- విద్యార్థుల్లో పెరుగుతున్న అవగాహన
- ఊరూరా వెళ్తూ పాలిటెక్నిక్ విద్యపై అవగాహన కల్పిస్తున్న లెక్చరర్లు
- నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ గడువు
- ఉమ్మడి జిల్లాలో 1,320 సీట్లు

వనపర్తి టౌన్: పోటీ ప్రపంచంలో ఉపాధి, ఉద్యోగావకాశాలకు పాలిటెక్నిక్ విద్యతో ఎంచక్కా ఎదిగే అవకాశాలు ఉన్నాయి. పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ ద్వారా సంబంధిత కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేట్‌లో సులువుగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రస్తుత కాలానికి అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకుని, అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పాలిటెక్నిక్ విద్య దోహదపడనుంది. ఈ మేరకు వనపర్తి కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా జిల్లా వ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యపై అవగాహన కల్పిస్తూ, ఏయే కోర్సులతో భవిష్యత్ ఎలా ఉండనుందో తెలియజేస్తున్నారు. ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థులకు పాలిటెక్నిక్ చదివిన తర్వాత నేరుగా ఇంజనీరింగ్ 2వ సంవత్సరంలో చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఇంజనీరింగ్ విద్య పూర్తి చేయవచ్చని ప్రచారం చేస్తున్నారు. పాలిటెక్నిక్ ద్వారా ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులకు సాంకేతిక విద్యకు సంబంధించి ప్రాక్టికల్ పరిజ్ఞానం ఎక్కువగా ఉంటుందని, పాలిటెక్నిక్ విద్య పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని చెప్పారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడానికి tspolycet 2023 ప్రవేశ పరీక్షను మే17న నిర్వహించనున్నారని, పది రోజుల తర్వాత ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు.

సివిల్ ఇంజినీరింగ్..

కోర్సులలో చేరిన విద్యార్థులు రోడ్లు, భవనాలు, వంతెనలు మొదలైన కట్టడాల యొక్క నిర్మాణానికి సంబంధించిన విద్యను అభ్యసిస్తారు. ఈ కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రహదారులు అండ్ భవనాల శాఖ, నీటిపారుదల శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, కార్పొరేషన్లు, విద్యుత్ బోర్డులు మరియు నిర్మాణ రంగానికి సంబంధించిన వివిధ ప్రభుత్వ ప్రాజెక్టులలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

మెకానికల్ ఇంజినీరింగ్:

ఈ కోర్సులో చేరిన విద్యార్థులు పారిశ్రామిక రంగానికి అవసరమైన యంత్రాలను, యంత్ర పరికరాలను నిర్మించడం, వాటితో వివిధ రకాల నిత్యావసర ఉత్పత్తుల తయారీ మొదలైన విషయాలను నేర్చుకుంటారు. ఈ కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అన్ని ప్రభుత్వ రంగ, పబ్లిక్ సెక్టార్, ప్రైవేట్ సెక్టర్ పరిశ్రమలలో, ఆర్అండ్‌బీ, నీటి పారుదల, పీఆర్, ఇండియన్ రైల్వే, డీఆర్‌డీఓ, డీఆర్‌డీఎల్, ఇస్రో, టీఎస్ఆర్టీసీలలో ఉద్యోగావకాశాలు ఉంటాయి.



వనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో పాలిటెక్నిక్ విద్యపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్..

ఈ కోర్సులతో విద్యుత్ ఉత్పత్తి, ప్రసార పంపిణీలకు సంబంధించిన విద్యను నేర్చుకుంటారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు బీహెచ్ఈఎల్, ఎన్టీపీసీ, ఓఎన్జీసీ, బీఎస్ఎన్ఎల్ మొదలైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం మొదలైన రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలు, ఇండియల్ రైల్వే, టీఎస్ఆర్టీసీ మొదలగు రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.

ఎలక్ట్రానిక్ అండ్ ఇన్‌స్ట్రుమేషన్ ఇంజినీరింగ్..

ఈ కోర్సుతో విద్యార్థులు పారిశ్రామిక, వైద్య, అంతరిక్ష రంగాలలో ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాల నిర్వహణ వినియోగానికి సంబంధించిన విద్యను నేర్చుకుంటారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు డీఆర్‌డీఓ, డీఆర్‌డీఎస్, బీఏఆర్సీ, ఇస్రో, బీహెచ్ఈఎల్, ఎన్టీపీసీ, ఓఎన్జీసీ, ఎస్ఏఐఎల్, జీఏఐఎల్ మొదలైన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ట్రాన్స్‌కో, జెన్‌కో మొదలైన రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలు, ఇండియన్ రైల్వే, ఇండియన్ నావీ, హెచ్ఏఎల్, బీడీఎల్, మొదలగు రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి

పాలిటెక్నిక్ విద్యతో అన్నిరంగాల్లో స్థిరపడవచ్చు. పాలిటెక్నిక్ కోర్సుల ప్రాముఖ్యతను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవగాహన పెంచాలని నిర్ణయించాం. అందులో భాగంగానే విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పాలిటెక్నిక్ చదివితే భవిష్యత్ ఉండదనే అపోహ తప్పకుండా తీరుతుంది. సోమవారం వరకు పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. – చంద్రశేఖర్, ప్రిన్సిపాల్, వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్

నేడే దరఖాస్తుకు ఆఖరు

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి సోమవారం చివరి రోజు. జనరల్ విద్యార్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీలు రూ.250 పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు గూగుల్ క్రోమ్ బ్రౌసర్‌లో ఈ వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వాలని చెప్పారు. polycet.sbtet.telangana.gov.in . ఈ ప్రవేశ పరీక్షలో విద్యార్థులు సాధించిన ర్యాంక్‌లకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని, కంప్యూటర్ ప్రోగ్రామ్ ద్వారా వేర్వేరు కళాశాలల్లో వేర్వేరు కోర్సులలో ప్రవేశం లభిస్తుందని తెలిపారు.

డిప్లొమా ఇన్ ఫార్మసీ..

ఈ కోర్సు శిక్షణకాలం రెండు సంవత్సరాల మూడు నెలలు. మొదటి రెండేళ్లు కళాశాల విద్య, మిగిలిన మూడు నెలలు హాస్పిటల్ ట్రైనింగ్ ఉంటుంది. తెలంగాణలో ఇంటర్మీడియట్ (ఎంపీసీ/బైపీసీ)లో కనీసం 50శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఫార్మసీ డిప్లొమా చదవడానికి అర్హులు. విద్యార్థులు దోస్త్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ఫార్మసీ డిప్లొమాలో సీటు లభిస్తుంది. ప్రతి సంవత్సరంలో జూన్–జూలైలో దోస్త్ పోర్టల్‌లో నోటిఫికేషన్ ఇవ్వబడుతుంది. ఫార్మసీ డిప్లొమాలో చేరిన విద్యార్థులు మందుల తయారీ, వాటి వినియోగం వాటి ఉపయోగాలు, సైడ్ ఎఫెక్ట్‌కు సంబంధించిన విద్యను అభ్యసిస్తారు. దీంతోపాటు సమాజంలో ఫార్మాసిస్ట్ పాత్రను చదువుకుంటారు. ఫార్మసీ డిప్లొమాలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఫార్మసీ బోర్డు ద్వారా ఎగ్జిట్ ఎగ్జాం పాస్ అయితే రిజిస్టర్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ ఇస్తారు. అన్ని ప్రభుత్వ రంగ, ప్రైవేట్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలలో ప్రభుత్వ/ప్రైవేట్ హాస్పిటల్‌లో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. అంతేకాక సొంతంగా మెడికల్ షాపులను నిర్వహించుకోవచ్చు. లేదా మెడికల్ షాపులలో పనిచేయవచ్చు.

ఇళ్లు కదులుతున్నాయ్!



అధికారులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

- రహదారి నిర్మాణంలో ఎర్త్ కంపాక్టర్ వైబ్రేటర్ రోలర్ వినియోగం
- సమీప ఇళ్లల్లో ప్రకంపనలు
- భయపడి బయటకు పరుగులు తీసిన జనం
- అధికారులతో వాగ్వాదం



రోడ్డు పనులకు ఉపయోగించిన అర్త్ కంపాక్టర్ వైబ్రేటర్ రోలర్

జోగుళాంబ శక్తిపీఠం/అలంపూర్ రూరల్: కేంద్ర పర్యాటకశాఖ ప్రసాద్ స్కీంలో భాగంగా అలంపూర్ నదీతీరంలో రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఆదివారం సంబంధిత అధికారులు రహదారి పనులను వేగంగా పూర్తి చేసేందుకు ఎర్త్ కంపాక్టర్ వైబ్రేటర్ రోలర్ యంత్రాన్ని వినియోగించారు. దీంతో వచ్చిన ప్రకంపనలకు సమీప ఇళ్లల్లో ఒక్కసారిగా సామగ్రి కదలడంతో ప్రజలు భయపడి బయటకు పరుగులు తీశారు. యంత్రాల వినియోగంతో ఇలా జరిగిందని గ్రహించి పనులు నిలిపివేసి అధికారులతో వాగ్వాదానికి దిగారు. వరదల కారణంగా ఇక్కడి ఇళ్లన్నీ నీటిలో మునిగిని బలహీనంగా మారాయని.. ఇలాంటి సమయంలో వైబ్రేషన్ యంత్రాలు వినియోగించడంతో ఇళ్లన్నీ కంపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. విషయాన్ని దేవస్థానం పాలకమండలి మాజీ ధర్మకర్త, ప్రసాద్ స్కీం సైట్ ఇంజినీర్ రామకృష్ణకు తెలుపగా వెంటనే పనులు నిలిపివేయించారు. యంత్రాలు వినియోగించకుండా పనులు చేపడతామని హామీ ఇచ్చి సమస్యలను సద్దుమణిగించారు.

భయంగా ఉంది..



ఎండలు అధికంగా ఉండటంతో పిల్లా పాపలతో కలిసి ఇంటిలోనే నిద్రిస్తున్నాం. ఇంట్లో ఉన్న స్టీలు సామగ్రి, పాత్రలు ఒక్కసారిగా కదులుతూ కిందపడిపోయాయి. ఏం జరుగుతుందో అర్థంగాక బయటకు పరుగుతీశాం. పనుల్లో వినియోగించే యంత్రంతో ఇంటిలో ప్రకంపనలు వచ్చినట్లు తర్వాత తెలుసుకున్నాం. – పద్మావతి, స్థానికురాలు

ఇంటి గోడలకు నెర్రెలొస్తున్నాయి



రోడ్డు నిర్మాణ పనుల్లో వైబ్రేషన్ మిషన్లు వాడుతున్నారు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లన్నీ కదులుతున్నాయి. ఇంటి గోడలకు కూడా నెర్రెలొస్తున్నాయి. ఏమైనా జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించాం. – పార్వతి, గృహ యజమాని

తాత్కాలికంగా పనులు నిలిపివేశాం..



రహదారి నిర్మాణంలో ఎర్త్ కంపాక్టర్ వైబ్రేటర్ రోలర్ వినియోగంతో ఇళ్లలో కదలికలు రావడం వాస్తవమే. విషయం తెలియగానే ఘటన స్థలానికి చేరుకొని పనులు నిలిపివేశాం. ఈ యంత్రంతో 25 నుంచి 30 మీటర్ల మేరకు వైబ్రేషన్ వస్తుంది. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేపడతాం. – రామకృష్ణ, సైట్ ఇంజినీర్

మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి ఆరోగ్యం విషమం



ఆరోగ్య పరిస్థితి గురించి సీతాదయాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

ఇంట్లోనే వెంటిలేటర్‌పై వైద్యమందిస్తున్న డాక్టర్లు

మక్తల్/ చిన్నచింతకుంట: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి ఆరోగ్యం విషమించింది. క్యాన్సర్ బారినపడిన ఆయన కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల కొంతమేర ఆరోగ్యంగా ఉండగా.. నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో సైతం పాల్గొన్నారు. సుమారు వారం క్రితం ఆరోగ్యం క్షీణించడంతో మళ్లీ ఆస్పత్రిలో చేరారు. ఆదివారం ఆయనను తన స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని పర్కాపురంలోని ఇంటికి తీసుకొచ్చారు. వైద్యులు ఇంట్లోనే వెంటిలేటర్, ఇతర వైద్య పరికరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. దయాకర్‌రెడ్డి ఆరోగ్యం విషమించిందనే సమాచారం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎస్.రాజేందర్‌రెడ్డి, మాజీ మంత్రులు జూపల్లి కృష్ణారావు, నాగం జనార్దన్‌రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భరతసింహారెడ్డి, బక్కని నర్సింహులు తదితరులు పర్కాపురంలోని ఇంటికి వచ్చి పరామర్శించారు. దయాకర్‌రెడ్డి భార్య, మాజీ ఎమ్మెల్యే సీతమ్మతో మాట్లాడారు. దయాకర్‌రెడ్డి పూర్వ అమరచింత నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు, మక్తల్ నియోజకవర్గం నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా విజయం గెలుపొందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో క్రియాశీలకంగా కొనసాగిన ఆయన ఇటీవలే ఆ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు.

మైసమ్మ ఆలయంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి పూజలు



మైసమ్మ ఆలయంలో వెంకటేశ్వర్‌రెడ్డి

నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవలే ఆయన పదవీ విరమణ పొందారు. ఆదివారం కుటుంబ సమేతంగా వచ్చారు. నవాబుపేట మండలంలోని దేపల్లి ఆయన స్వగ్రామం. దేవాలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ పురుషోత్తం ఆయనకు స్వాగతం పలికారు.